# మల్లన్నను దర్శించుకున్న కలెక్టర్



కొమురవెల్లి మల్లన్నను దర్శనం చేసుకున్న కలెక్టర్ మనుచౌదరి

చేర్యాల, మార్చి 25: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని కలెక్టర్ మనుచౌదరి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో అర్చకులు ఘనస్వాగతం పలికారు. కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలను ఆలయ ఈవోను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు కలెక్టర్‌కు స్వామివారి జ్ఞాపికతో పాటు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుడి మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, కొమురవెల్లి ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక సిద్దిపేట




జెరూసలెం బస్సు యాత్రను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

సిద్దిపేట, మార్చి 25: మతసామరస్యానికి ప్రతీక సిద్దిపేట అని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. సిద్దిపేట నుంచి మినీ జెరూసలెంకు 150 మంది పాస్టర్లు బస్సుల్లో బయలుదేరగా మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సుతో కలిసి ఆమె జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. 150 మంది పాస్టర్లు తలపెట్టిన మినీ జెరూసలేం యాత్ర సజావుగా సాగాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా బీరప్పస్వామి కల్యాణం



లింగాపూర్ బీరప్ప ఆలయంలో పెద్దపట్నం వేస్తున్న బీర్ల పూజారులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 25: ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బీరప్ప (పెద్ద)పండుగలో భాగంగా సోమవారం బీర్ల పూజారుల ఆధ్వర్యంలో బీరప్ప కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయం ఎదుట పెద్ద పట్నం వేసి స్వామివారి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించారు. సాయంత్రం మందపై సరుగుచల్లారు. బీరప్ప పండుగకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# వెండిశఠగోపం బహూకరణ



దాత ఇనకొండ చంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

మర్కూక్, మార్చి 25: మండల కేంద్రంలో రంగనాయకస్వామి ఆలయానికి దాత ఇనకొండ చంద్రారెడ్డి వెండిశఠగోపాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దాతతో పాటు ఆయన కుటుంబీకులు ప్రణితారెడ్డి, అక్షితారెడ్డి, భవిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ బీసీసెల్ నాయకుడు కనకయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురి అరెస్ట్



రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న తొగుట సీఐ లతీఫ్

రాయపోల్, మార్చి 25: గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి 825 గ్రాముల గంజాయి, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన రాయపోల్ పీఎస్‌లో వెల్లడించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అదేశాల మేరకు, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో రాయపోల్ ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి ఆదివారం మండలంలోని అనాజీపూర్, కొత్తపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఏడుగురు అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 825 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నందుకు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, రాయపోల్ ఎస్సై రఘుపతిని అభినందించారు. గంజాయి అక్రమంగా సరఫరా చేస్తున్న వారిలో రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి స్వామి, కోనేరు మహేశ్‌బాబు, మండలంలోని పెద్దఆరెపల్లికి చెందిన గొల్లరాజు, బాకీరాజు, గజ్వేల్ మండలం బూరుగుపల్లికి చెందిన పంజాల అనిల్, కృష్ణమూర్తి, అహ్మదీపూర్ గ్రామానికి చెందిన క్యామిద్రి వంశీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు లింగం (ఫైల్)

దుబ్బాక, మార్చి 25: దుబ్బాక పట్టణంలో భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన పోతరాజు లింగం(37) తన భార్యాపిల్లలతో కలిసి దుబ్బాక పట్టణంలో గుండ్ల హరికృష్ణ భవనంలో పదిహేను రోజులుగా అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం రాత్రి భవనం పైనుంచి చెత్త కవర్ బయటకు విసిరేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే లింగం మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య వేదశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

# రంగులమయం

## జిల్లాలో ఆనందోత్సాహాలతో హోలీపండుగ

- వయోభేదం లేకుండా వేడుకల్లో పాల్గొన్న జనం
- రంగులు చల్లుకుని సందడి
- కలర్‌ఫుల్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

జిల్లాలో హోలీ సంబురాలు అంబురాన్నంటాయి. ఆదివారం రాత్రి కామదహనం కాగా సోమవారం తెల్లవారుజామునుంచే రంగులకేళీ ప్రారంభమైంది. చిన్నాపెద్ద వయోభేదం లేకుండా కలర్‌ఫుల్ వేడుకల్లో మునిగితేలారు. స్నేహితులు, బంధువులతో కలిసి ఆడిపాడారు. రకరకాల రంగులు కలిపిన నీటిని చల్లుకుని హోలీ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. మహిళలు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొని హోలీ ఆడి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పల్లెల్లో డబ్బులు, డోలు వాయిద్యాలతో ర్యాలీగా తిరుగుతూ పాటలు పాడుతూ సందడి చేశారు. యువకులు రోడ్లపైకి వచ్చి కోడిగుడ్లు, టమాటాలతో స్నేహితులకు కొట్టడంతో పాటు రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు.

– సిద్దిపేట జిల్లా న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 25



సిద్దిపేటలో రంగులు చల్లుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్‌పర్సన్



హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లో పారిశుధ్య సిబ్బందితో చైర్‌పర్సన్ రజితావెంకన్న



దుబ్బాక: దుబ్బాకలో హోలీ వేడుకలో బీఆర్‌ఎస్ నాయకులు



గజ్వేల్ పట్టణంలో కాముని దహనంలో పాల్గొన్న మహిళలు



కొండపాక(కుకునూరుపల్లి): హోలీ వేడుకల్లో పాల్గొన్న అంబేద్కర్ సంక్షేమ సంఘం సభ్యులు



చేర్యాలలో హోలీ వేడుకలు జరుపుకుంటున్న మహిళలు



అక్కన్నపేట మండలంలోని అంతాయిపల్లిలో హోలీ సంబురాలు



హుస్నాబాద్: హోలీ వేడుకల్లో కౌన్సిలర్ రమాదేవి, మహిళలు



సిద్దిపేట: సిద్దిపేట భారత్‌నగర్‌లో హోలీ ఆడుతున్న చిన్నారులు



మద్దూరు(ధూళిమిట్ట): మద్దూరు పీఎస్‌లో ఎస్సై షేక్ యూనుస్‌అహ్మద్ తదితరులు



సిద్దిపేట: పట్టణంలో హోలీ ఆడుతున్న చిన్నారులు



జగదేవ్‌పూర్: చాట్లపల్లి హోలీ సంబురాల్లో పాల్గొన్న యువకులు



సిద్దిపేట: సిద్దిపేటలో మహిళల సందడి



తొగుట: హోలీ సంబురాల్లో ఎల్లారెడ్డిపేట గ్రామ యువకులు



కొమురవెల్లి: మర్రిముచ్చాలలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత



రాయపోల్‌లో హోలీ సంబురాలు జరుపుకుంటున్న చిన్నారులు



వర్గల్: నెంటూర్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



మిరుదొడ్డిలో హోలీ ఆడుతున్న యువకులు



గజ్వేల్: గజ్వేల్‌లో హోలీ ఆడుతున్న చిన్నారులు



అక్కన్నపేట: మండల కేంద్రంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



హుస్నాబాద్ పీఎస్ ఆవరణలో హోలీ వేడుకల్లో ఎస్సై తోట మహేశ్

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

చేర్యాల, మార్చి 25: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయా పార్టీలు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ శ్రీను అన్నారు.మండలంలోని చిట్యాలలో సోమవారం ఎన్నికల పోలింగ్ స్టేషన్లను ఎస్సై దామోదర్‌తో కలిసి సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా సాగేందుకు ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు.గ్రామాల్లో ఎలాంటి అలజడి సృష్టించినా, రేషన్, ఇసుక, గంజాయి తదితర వాటిని అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో పర్యటిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

# బేగంపేటలో ఆనందయ్య జాతర



ఆనందయ్య చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జంకి, మార్చి 25: మండలంలోని బేగంపేటలో ఘనంగా ఆనందయ్య జాతర జరిగింది. ఈ సందర్భంగా స్వామి ప్రతిమను రథంపై ఉంచి ఊరేగించారు. గ్రామంలో వాహనాల ఊరేగింపు నిర్వహించి, కొబ్బరికాయలు, మంగళహారతులు ఇచ్చి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

చేర్యాల, మార్చి 25: తండ్రి కారు కొనివ్వలేదని చేర్యాల పట్టణానికి చెందిన ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేర్యాలకు చెందిన బుట్టి నర్సింహులు కుమారుడు నవీన్‌కుమార్ (26) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తనకు కారు కొనివ్వాలని తండ్రిని కోరుతుండగా ఆర్థిక పరిస్థితుల కారణంగా కొన్ని రోజుల అనంతరం కారు కొనిస్తానని కొడుకుకు తండ్రి సర్దిచెప్పాడు. తాను టెంపరరీ డ్రైవర్‌గా వెళ్తున్నానని, కారు కొనిస్తేనే ఓనర్ కం డ్రైవర్‌గా పనిచేసుకుంటానని, కారు కొనిచ్చే వరకు వెళ్లేది లేదని 15 రోజులుగా నవీన్‌కుమార్ ఇంట్లోనే ఉంటున్నాడు. ఎన్ని రోజులు ఇంట్లో ఉంటావని ఆదివారం మందలించడంతో నవీన్‌కుమార్ మనస్తాపానికి గురై సోమవారం పట్టణ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



శ్రీరాములుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పిల్లి సుధాకర్, నాయకులు

# పొలిట్ బ్యూరో చైర్మన్‌గా శ్రీరాములు

మిరుదొడ్డి, మార్చి 25: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు ర్యాకం శ్రీరాములును రాష్ట్ర మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్‌గా నియమించారు. సోమవారం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఉద్దండ పురం సత్యనారాయణ శ్రీరాములుకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

# గులాబీజెండా ఎగరడం ఖాయం



యాదవరెడ్డి

రాయపోల్, మార్చి 25: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని దౌల్తాబాద్, రాయపోల్ ఉమ్మడి మండలాల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సర్వుగారి యాదవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన అహ్మద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే రాష్ట్రంలో చికటి రాజ్యం వస్తుందన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కనుకగా ఇవ్వాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.